
అప్పిరాజుకి ఇష్టాయిష్టాలున్నాయ్. అతను ఇష్టపడిన వాటిని హోర్మోన్లల్లా ఉపయోగించుకుని, ఇష్టపడని వాటిని ట్యూమర్‌లా పెరగనివ్వకుండా మొదలుకొట్టేసి, బ్లాక్కు సైకిలు వదిలి మోటారు సైకిలు, అద్దెయింటినించి స్వంత ఇంటికి రాగలిగాడు.





కానీ ఒక్క విషయంలో మాత్రం ఈ నాటికీ, తన అయిష్టత పెరుగుదలను అరికట్టలేకపోయాడు.

ఉదయమే మోటారుసైకిలు తీసాడు. రోజూ యేదో ఒక విషయం జరుగుతూనేవున్నది. ఆ విషయం గురించి ఆలోచిస్తేకదా నేర్చుకోడానికీ, దిద్దుకోడానికీ వ్యక్తిగా పెరగడానికీ అవకాశం ఉంటుంది. ఈ వేళనైనా నిన్నటికీ, ఈవేళకీ యేదో భేదం ఉంటుందేమోనని మోటారుసైకిలు ఎక్కినప్పుడు తట్టింది. ఎటొచ్చీ నిన్నమధ్యాహ్నం, ఈ వేళయెండ, అంతే భేదం అనుకుంటుంటే కొంతదూరం వెళ్లాక మోటారుసైకిలుకాదు. కాదని తలవూపినట్లు కదలిపోతున్నది. చూస్తే వెనుక చక్రంలో గాలి లేదు. కొంతదూరం నడిపించుకుని తీసుకెళ్ళాడు. రోడ్డువార కాలువనంటుకుని చిన్నరేకుల షెడ్డు. అందులో పనిచేసుకునేవారు, ఇంకొకడు కూర్చోడానికి చోటు సరిపోతుంది.

ఆ రిపేరు షాపు యజమాని బలంగానే ఉన్నాడు.ముడుకులుదాటిన కాకీనిక్కరు మీద నల్లని మచ్చలు. కాలరు బనియనుచూపి, షెడ్డులో బెంచిమీద కూర్చోబెట్టి, మాటల్లో అక్కడక్కడా, ఇంగ్లీషుపదాలు ఉపయోగిస్తున్నాడు.వెనుకచక్రం విప్పి ట్యూబ్ తీసి, షెడ్డులో ఉన్న తన అసిస్టెంటుని ''ఒరేగుండుగా'' అని పిల్చాడు. ఆ గుండుగాడి వయసు పధ్నాలుగేళ్ళు. గుండు గీయించుకోవడం అలవాటులా వుంది. వీడిది పొట్టినిక్కరు. చేతుల్లేని నల్ల బనియను. ఆ నల్లని శరీరానికి పట్టే వుంది.

నాలుగు షాపులు దాటాక ఒక కారు రిపేరుషాపు ఉంది. అక్కడ ట్యూబ్‌కి గాలి కొట్టించి యెక్కడ పంచరుందో తెలుసుకోడానికి వాడు వెళ్తే వాడివెంటనే షాపు యజమానికూడా వెళ్ళాడు.

ఒంటరిగా కూర్చున్న అప్పిరాజు రోడ్డువేపు చూస్తున్నాడు. ఎండ ధగధగలాడుతోంది. ఎందరెందరో రోడ్డుమీద పోతున్నారు. అందులో ఒకడు రెండుసార్లు చేతిలో జంగిడీలు, జంతికలు, పప్పులు వగైరా అమ్ముతూ ఆ షెడ్డు ఎదరగా ఆగాడు, అరిచాడు, వెళ్ళిపోయాడు. ఈసారి వచ్చిన వాడిమీద అప్పిరాజు అరిచాడు. అడుక్కున్న వాళ్ళను చూస్తే అతనికి పరమ అసహ్యం. పో పో అని కసిరేసాడు. వాడు పోకుండా పక్కనే నిల్చున్నాడు. దానితో అతని పెరుగుతున్న అయిష్టం బద్దలైపోయినట్లు ''ఈ అడుక్కునే దరిద్రం ఎప్పుడు పోతుందోగానీ...'' అంటే ఆ ముసలిసాధు నవ్వుముఖంతో మెల్లగా ''నీళ్లు ఇవ్వనివాడివని తెలుసులే బాబూ! నీ కోసం రాలేదు'' అంటూ ఇటూ అటూ చూసి వెళ్ళిపోయాడు.

ఈ అడుక్కునే వాళ్ళమీద అసహ్యం ఈ నాటిది కాదు. తన చిన్న వయసులో ప్రతి ఆదివారం తన ఇంటి యెదురుగా గుడ్డి వడ్డి భిక్షంకోసం పోగయ్యేవారు. తన తండ్రి ఆరోజుల్లో ఇంట్లో లేదనకుండా బియ్యం భిక్షంవెయ్యించేవాడు. ఒక రోజు బియ్యం వెయ్యలేదని ఒక కుష్ఠురోగి నోటికొచ్చినట్లు కూసేసాడుకదా... ఎందరెందరు అబద్ధాలు చెప్పి బిచ్చమెత్తుకున్నవాళ్ళు తారసపడ్డారు. బోగస్ చందాపుస్తకాలు సృష్టించి మరీ మర్యాదగా మోసగించి అడుక్కునే వాళ్ళు. ఇవ్వకపోతే శపిస్తానన్నట్లు చూసే దొంగసాధులు, ఒళ్ళు కప్పుకోడానికి, చలిలో చావకుండా ఉండడానికి బట్టలిస్తే బజారులో అమ్ముకునేవాళ్ళు... ఎన్నెన్ని జీవితంలో చూసిన ఘట్టాలు ఈ క్షణంలో కళ్ళయెదరగా కదలాడుతున్నాయ్.

''గుండు తిరిగొచ్చాడు. ట్యూబుకు పంచరు వెయ్యడానికి షెడ్డులో కూర్చునే ముందు నిక్కరు జేబులో నించి పదిపైసల నాణెంతీసి ప్రక్కనే పెట్టాడు. పంచరు గురించి మాటాడుతూ పనిచేస్తున్నాడు. వల్కనైజింగు చెయ్యాలి కాస్త టైము పడుతుంది. మాటల్లో గడపాలి కదా. అందుకే అప్పిరాజు ఆ పది



# బలివాడ కాంతారావు

పైసల వేపు చూస్తూ "ముష్టులు వాడు రెండు సార్లు వచ్చి వెళ్ళిపోయాడు" అని అన్నాడు.

"మళ్ళా వస్తాడు! అనేసాడు. ఆ పది పైసల కు చిన్న ముష్టి వస్తుందా రాదా అన్న ఆలోచన లో పడ్డాడు అచ్చిరాజు. ఈ ఆలోచనల కన్నా గుండుగాడి గురించి తెలుసుకుందామని" ఇక్కడ పనిచేస్తున్నావుకదా— ఎంతిస్తాడు?"

"తిండిపెట్టాడు. రోజుకి పావలా జేబు ఖర్చుకిస్తాడు"

"ఎంత పనిచేసినా అంతేనా?"

"అమ్మానాన్నా లేనోడికి తెచ్చి తిండిపెట్టి నాడు. పనినేర్పినాడు. మరేంటడుగుతాను?" అంతలో ఇదివరకు ఎవరిమీద అరిచాడో ఆ అడుక్కునేవాడు మళ్ళీ ప్రత్యక్షం. ఈసారి ఇంకా గట్టిగా అరుద్దా మనుకునేలోగా గుండు గాడు లేచి ఆ పదిపైసలు వాడి డొక్కులో వేసాడు. ఆ చిరునవ్వు రుద్రుడ్ని దీవించిన ట్లుంది. అదే అచ్చిరాజుని శపించినట్లు కూడా ఉంది.

"ఆ పదిపైసలు ముష్టికోసదానికి ఉంచా వుకదా"

"కాదు బాబూ ఆ సాధురాం కోసమే వుంచాను"

"వాడికోసం యెందుకుంచావ్?"

"నాకన్నా అనాదోడు కదా..." "ఎలాగ?"

"నాను పనిచేసుకుంటున్నాను. ఆడు పని చేసుకోలేడు. నాను తింటున్నాను. ఆడూ తి నాలకదా.."

"నివ్వే పేదోడివి కదా! పాతిక పైసల్లో రోజా పదిపైసలు దానం చేస్తావా?" "రోజా చేస్తాను"

"నీకేం వస్తాది?"

"పది పైసలూ పదిమంది యేస్తే ఒక అనాదోడు ఆకలితో చచ్చిపోడు కదా..." "పుణ్యం వస్తాదని చేస్తున్నావా?"

"ఆ సాదువవ్వు చూపినారుకదా. ఆ నవ్వు తల్చుకుని, నవ్వుతూ రోజంతా పనిచేసేస్తాను"

"ఆ నవ్వుతో నీ కడుపు నిండిపోతాదా?"

"అలాగే...అదేటో... హాయిగా ఉంటాది"

పంచరు వేసే టైంకూ పెద్ద దిగబడ్డాడు. చక్రంబిగించి యెంతంటే యెనిమిది రూపాయలన్నాడు. ఎక్కడా ఆరైతే ఈ రెండు రూపాయలు అడుక్కున్నట్లుకదా! పది పైసలు ఇందులోనిది ఆ గుండుగాడికి వెళ్ళదుకదా! ఇవ్వక తప్పలేదు. అవసరం.

ఇంటికి వచ్చాక అలసటగా మంచంమీద వాలబడి పోయాడు. సముద్రంమీద నించి వచ్చినగాలి తూరుపు కిటికీ నించి వీస్తోంది. ఆ హోరు వినిపిస్తున్నా మనసులో మరో విధమైన హోరు. ఎన్నాళ్ళకు మనసులో ఆలోచనలను సృష్టించి ఆత్మవిమర్శకు దారితీసింది. మరో క్షణంలో గుండు మనసునించి మాయమై ఆ జాగాలో గతించిన తండ్రి నిల్చున్నాడు.

ఈ ఇల్లు కట్టుకుని గృహప్రవేశం చేసిననాడు తండ్రి కళ్ళల్లో ఆనందబాష్పాలు వచ్చిన అతిథుల మధ్య

"నాకు సరిగ్గా జరుగుబాటు లేనిరోజుల్లో బీదా బిక్కీ కడుపులకు ఇంత గంజి పోసాను. దాని ఫలితంగానే, దేముడు నాకొడుక్కి ఈ యైశ్వర్యం ఇచ్చాడు" అన్నాడు. ఆనాడు యెవరి పిచ్చివాడి కానందం అని అచ్చిరాజు సరిపుచ్చుకున్నాడు. ఈ ఇంట్లోనిగాక అడుక్కునే వాళ్ళు అడుగుపెట్టకుండా అచ్చిరాజు చేస్తే, చాటుగా దానంచేసే తండ్రి మీదే తిరగబడ్డాడు. కుష్ఠురోగి అడ్డదిడ్డంగా వాగాడని కర్ర పట్టుకుని వెళ్తుంటే తండ్రి ఆపేసి "వాడు తెగించగలడు. నివు తెగించి ఈ పని చెయ్యకూడదని" వారించాడు. ఒక సాధు కళ్నెరచేసిపోతే "నయం. వాడు శపించలేదు" అని తండ్రి తృప్తిచెందాడు.

చివరిరోజుల్లో మంచంమీద చావుబతుకుల మధ్య ఉన్న తండ్రికి చెయ్యగల సేవ, చూపించగలిగినంత ఆప్యాయత, అతని ఆరోగ్యం చేకూరాలని అంతడబ్బు ఖర్చుపెట్టినా అతని చివరిమాట నిని: "నాయనా! నాచేతులు కట్టేసి నన్ను బందీని చేసావురా!"

ఈ గుండుగాడు ఈ రోజు అచ్చిరాజును బంధవిముక్తుని చేశాడు. అందుకే ఆ చేతులు ఇచ్చేవేపుకు ఈ నాటినించి కదులుతున్నాయ్.